## క్లుప్తంగా

### సందడిగా సీతారాముల పెళ్లి రాట



రాయపుర అగ్రహారంలోపెళ్లి రాట ఉడుస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు

సబ్బవరం: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారామల కల్యాణం నిర్వహణకు మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సబ్బవరం రామాలయంతో పాటు రావలమ్మపాలెం, బంగారమ్మపాలెం, గుల్లేపల్లి, అమృతపురం,మొగలిపురం, మల్లునాయుడుపాలెం, రాయపుర అగ్రహారం తదితర గ్రామాల్లో సోమవారం పెళ్లిరాట శాస్త్రోకంగా వేశారు. కార్యక్రమాల్లో ఎస్.నారాయ ణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, బర్ల రమణ, దంగేటి నాని, దాడి కన్నంనాయుడు, పిల్లల అప్పలనాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

### నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతల నుంచి భక్తులు తరలివచ్చి పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ కార్యక్రమాలను నిర్వహించారు.

### కొనసాగుతున్న లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు



పూజలందుకున్న లలితాంబిక

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో లలితాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచదశ మంత్రజపం,అభిషేకాలు,శోడషోపచార పూజ,లలితా హోమం వంటి ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

### రామాలయంలో విశేషంగా హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామివారి సీతారాముల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హోమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

### కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1159వ రోజుకు చేరుకున్నాయి.



# వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్సాహంగా ఐదో రోజు ఎన్నికల ప్రచారం
- బ్రహ్మ రథం పట్టిన ప్రజలు

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. మండలంలో ఐదో రోజు సోమవారం ఈ.బోనంగి, పి.బోనంగి, రావాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ. బోనంగిలో సచివాలయ కన్వీనర్ బొద్దపు చిన్నారావు, యువజన విభాగం కార్యదర్శి కంచిపాటి భాస్కర్, పి.బోనంగిలో మాజీ ఆర్‌ఈసీఎస్ చైర్మన్ చల్లా కనకారావు, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, రావాడలో వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఆధ్వర్యంలో మహిళలు ఎమ్మెల్యే ర్ధి అదీప్‌రాజ్‌కు హారతులిచ్చి పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు.

**ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి**

ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన మేలును గుర్తించి మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా బూడి ముత్యాల నాయుడు గెలిపించాలని అదీప్‌రాజ్ అభ్యర్థించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జగనన్న ప్రతీ గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసి సేవలు అందించడానికి అవసరమైన సిబ్బందిని కూడా నియమించారని చెప్పారు. వలంటీర్లను నియమించి ఇంటి ముంగిటకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని అదీప్‌రాజ్ చెప్పారు.

**అబద్ధపు హామీలను నమ్మవద్దు**

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలు వల్లిస్తున్న అబద్దపు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఈ.బోనంగిలో రూ.13.20 కోట్లు, పి.బోనంగిలో రూ.14.40 కోట్లను ఖర్చు చేసినట్టు చెప్పారు. ప్రతిపక్షలు ఎన్ని కుట్రలు.. కుతంత్రాలు పన్నినా ప్రజలు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అదీప్‌రాజ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, గొర్లి గోపి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న అదీప్‌రాజ్



అదీప్‌రాజ్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఫార్మాసిటీ కాలనీ ప్రజలు, నాయకులు



విజయోస్తు.. ఫార్మాసిటీ కాలనీలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు తిలకం దిద్దుతున్న మహిళ



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని మహిళలను కోరుతున్న అదీప్‌రాజ్

## అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలకు చెక్



అగ్నిమాపక విన్యాసాలను ప్రదర్శిస్తున్న కార్మికులు



అగ్నిమాపక అధికారి వెంకటరమణకు జ్ఞాపిక బహూకరిస్తున్న సుబ్బారావు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఎంఎస్‌ఆర్‌ఎం సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ 1944లో ముంబైలో పోర్టులో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించారు. రాంకీ అగ్నిమాపక సిబ్బంది, ఎంఎస్‌ఆర్‌ఎం సిబ్బంది, ఫార్మాసిటీ ఈఆర్‌టీ సిబ్బందితో భద్రత శపథం చేయించారు. అనంతరం అగ్నిమాపక విన్యాసాలు నిర్వహించారు. అగ్నిమాపక యంత్రాలను ఉపయోగించి మంటలను అదుపు చేయడం, విష వాయువులు, పొగ కారణంగా స్పృహ కోల్పోయిన వారిని రక్షించడం, ఫోమ్‌తో మంటలను అదుపు చేయడం, బహుళ అంతస్తుల్లో చిక్కుకున్న వారిని రక్షించడం వంటి విన్యాసాలను ప్రదర్శించారు. విన్యాసాల్లో పాల్గొన్న వారికి అగ్నిమాపక అధికారి వెంకటరమణ బహుమతులు అందజేశారు. అగ్నిమాపక విన్యాసాల్లో పాల్గొన్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది, ఈఆర్‌టీ ఉద్యోగులను ఎంఏఎస్‌ఆర్‌ఎం సొసైటీ కార్యదర్శి జెట్టి సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మాన్నార్ భద్రత అధికారి ఎస్.నారాయణరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నియంత్రణపై మాక్ డ్రిల్



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

సబ్బవరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో మాక్ డ్రిల్,అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు,అవసరమైన జాగ్రత్తలను వివరించారు.గృహ సముదాయాలు,వ్యాపార భవనాలు,గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పలు అగ్ని ప్రమాదాలను వివరించారు.ఆయా ప్రమాదాలు సంభవించినప్పుడు నియంత్రించేందుకు చేపట్టే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు.అనంతరం ప్రమాదాల నివారణపై అవగాహన కలిగించే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది కె. అప్పలనాయుడు, పి. అప్పారావు,టి. వెంకటరావు,బి. ఉదయ్ కుమార్,బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల స్థలంలో అక్రమ నిర్మాణం



ఆక్రమణదారులను ప్రశ్నిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి



ఆక్రమణకు గురైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలం

**ఫిర్యాదు చేసిన ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి**

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తక్షణమే అడ్డుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి సోమవారం స్థానిక తహసీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు జనవరి 27, 2010లో రెవెన్యూ అధికారులు సబ్బవరం సర్వే నెంబరు 255/2లో ఐదు ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించి అప్పటి ప్రిన్సిపాల్కు అప్పగించారన్నారు. అప్పటి నుంచి సదరు స్థలం తమ ఆధీనంలో ఉందని చెప్పారు. ఇటీవల డిజిటల్ సర్వే చేసి కళాశాల సరిహద్దు చుట్టూ ఐదు ఎకరాల స్థలానికి కందకాలు తవ్వడం జరిగిందన్నారు. ఆదివారం సెలవు కావడంతో కొంత మంది ప్రైవేటు వ్యక్తులు డిగ్రీ కళాశాల వాయువ్య ప్రాంతంలో ఓ ప్రైవేటు లేఅవుట్ కు ఆనుకుని ఉన్న కళాశాల స్థలాన్ని యంత్రాలతో చదును చేసి నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. దీంతో సోమవారం పనులు అడ్డుకున్నట్టు చెప్పారు.నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

## కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు. ఆలయ అర్చకులు చక్రపాణి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## 138 మద్యం బాటిళ్ల పట్టివేత



టెక్కలిపాలెంలో పట్టుబడిన మద్యం బాటిళ్లతో సీఐ రమణ

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెంలో అక్రమంగా నిల్వ చేసిన 138 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వివరాలు.. అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం టెక్కలిపాలెం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.దేముడుబాబు తన ఇంటి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 138 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించారు.

## ముత్యాలు, చందన వస్త్రం అందజేత



ముత్యాలు అందజేస్తున్న స్వర్ణ జ్యుయలరీ అధినేత



చందనం వస్త్రాన్ని ఈవోకు అందజేస్తున్న దాత శ్రీరామ వెంకట నరసింహం

సింహాచలం: ఈ నెల 19న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గోపాలపట్నంలోని స్వర్ణ జ్యుయలరీ అధినేతలు బాబు, వెంకన్న, సునీల్, బాలాజీ రూ.75వేల విలువ చేసే ముత్యాలను సోమవారం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. అలాగే మే 10న స్వామివారి చందనోత్సవం పురస్కరించుకుని సుమారు రూ. 87వేల విలువ చేసే 120మీటర్ల చందనం వస్త్రాన్ని నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన శ్రీరామ వెంకట నరసింహం అనే భక్తుడు సమర్పించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ)లో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. ఒకటో తరగతిలో 32 సీట్లకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 27 మధ్యాహ్నంలోగా విద్యాలయంలోనే సమర్పించాలని చెప్పారు. మే 1వ తేదీన విద్యాలయంలో లాటరీ నిర్వహించి, అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు. పూర్తి వివరాలకు కేవీ అడ్మిషన్ గైడ్‌లైన్స్ లేదా విద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలియజేశారు.

## ఆరో రోజుకు గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన



పోర్టు వంతెన వద్ద ఆందోళన చేస్తున్న కార్మికుల కుటుంబ సభ్యులు

**కుటుంబసభ్యులతో కలసి నిరసన**

పెదగంట్యాడ: యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళనలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా కార్మికులు తమ కుటుంబాలతో కలసి పోర్టు వద్దకు చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. గంగవరం పోర్టు నిర్వాసితుల కమిటీ నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆరు రోజులుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పోర్టు కార్మికులకు తాగునీటిని ఇవ్వకుండా ఆపేశారని, దీంతో పోర్టులోకి అధికారులు వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి రాకపోతే, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు.

# సర్కారు బడి.. కార్పొరేట్ ఒరవడి



నాడు: అధ్వానంగా పురుషోత్తపురం పాఠశాల



నేడు: సుందరంగా పరుషోత్తపురం పాఠశాల



నాడు: పురుషోత్తపురంలో నేలపై భోజనాలు చేస్తున్న విద్యార్థులు



నేడు: పురుషోత్తపురంలో బల్లలపై భోజనాలు చేస్తున్న పిల్లలు

పెందుర్తి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయి. సర్కారు విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. నాడు– నేడు కింద కోట్లాది రూపాయలు కేటాయించి కార్పొరేటర్ పాఠశాలలను తలదన్నేలా వసతులు కల్పించారు. దీంతో నాడు అధ్వానంగా పాఠశాలలు నేడు కార్పొరేట్ ఒరవడితో కళకళలాడుతున్నాయి.

**ఇదీ పరిస్థితి**

పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2019కి ముందు అత్యంత ఇరుగ్గా ఉండేది. గాలి వెలుతురు వంటివి తరగతి గదుల్లోకి రాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆపసోపాలు పడేవారు. తాగునీటికి బోర్‌వెల్ కూడా ఉండేదికాదు. భోజనాలు శిథిలావస్థలో ఉన్న గచ్చు మీదే తినాల్సి వచ్చేది. ఈ పాఠశాలలో చదివేందుకు పిల్లలు అంతగా ఆసక్తి కనబరిచేవారు కాదు.

2019లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత నాడు–నేడు పథకం ప్రవేశపెట్టారు. పురుషోత్తపురం మండల పరిషత్ పాఠశాలలో వసతుల కల్పనకు రూ.20.08 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో పాఠశాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. తరగతి గదులు, మరుగుదొడ్డి ఆధునికీకరించారు.

– మండలంలోని కరకవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అన్ని గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తరగతి గదులు పెచ్చులూడి బిక్కుబిక్కుమంటూ పిల్లలు చదువుకునేవారు.అవసరాలకు మరుగుదొడ్లు లేకపోవడంతో పిల్లలు తుప్పల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి. వంటశాల ఉన్నా లేనట్లే...

కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పాఠశాల దశ దిశ మారిపోయింది. రూ.20 లక్షలతో సకల వసతులు కల్పించారు. చక్కటి గదులు నిర్మించి పాఠశాల భవనం చుట్టూ పచ్చదనం పెంపొందించారు. దీంతో పాఠశాలలో పిల్లలు చక్కగా చదువుపై దృష్టి సారిస్తున్నారు. ఇలా కేవలం ఒక పెందుర్తి మండలంలోనే నాడు–నేడు పథకంలో తొలి దశలో 17, రెండో దశలో 51(మూడు అంగన్‌వాడీలు కలిపి) పాఠశాలలు ఎంపిక చేశారు. రూ.29.99 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. తొలిదశలో కొన్ని పాఠశాలలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం రెండోదశ పనులు 51 పాఠశాలల్లో చురుగ్గా సాగుతున్నాయి.



ఆధునికీకరించిన తర్వాత సుందరంగా కరకవానిపాలెం పాఠశాల

## స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలు సోమవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. యాజమాన్యం, గుర్తింపు సంఘాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులకు వేతన సవరణ అమలు చేయాలని, ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడపాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి యు. శ్రీధర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జీఎం కె.సంజీవరావు, కారు రమణ, సుబ్బయ్య, ప్రభాకరరెడ్డి, కొమ్ము ప్రసాద్, ఎస్.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.